క్లుప్తంగా...

31న కోటలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ఈ నెల 31న గోల్కొండ కోటలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల ప్రైమరీ, హైస్కూల్ విద్యుత్ విడివిడిగా పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జూన్ నెల 2న కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి గోల్కొండ కోటలో నిర్వహించనున్న తెలంగాణ అవతరణ వేడుకల్లో జెండా ఎగురవేయనున్నట్లు తెలిపారు. అనంతరం పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారని ఆయన వివరించారు.

నేటి నుంచి జీఎన్ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

గోల్కొండ: షేక్‌పేట్ జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి తెలిపారు. 2019–23 బ్యాచ్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంక, ప్రముఖ కూచిపూడి డ్యాన్సర్ గడ్డం పద్మజారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి



వక్ఫ్ బోర్డు చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్వాన్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గంతో పాటు హైదరాబాద్, నగర పరిసరాల్లో వక్ఫ్‌బోర్డు ఆస్తులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కార్యాలయ ప్రతినిధి ముస్తాక్ తదితరులు ఉన్నారు.

మహంకాళి అమ్మవారికి ఏసీపీ పూజలు



లాల్‌దర్వాజా అమ్మవారిని దర్శించుకున్న ఏసీపీ ఆది నారాయణ

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని సీసీఎస్ ఏసీపీ ఆది నారాయణ ముదిరాజ్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మాజీ చైర్మన్ పోసాని సురేందర్ ముదిరాజ్ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోహన్, కృష్ణ, శ్యాంరావు ముదిరాజ్, రంగ హరినాథ్ గౌడ్, విజయ్, ప్రభు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



చార్మినార్: పాతబస్తీ రికాబ్‌గంజ్ కు చెందిన అశోక్ ఫౌండేషన్, హైదరాబాద్ కుంభమేళా వ్యవస్థాపక అధ్యక్షులు పంకజ్ కుమార్ అగర్వాల్‌కు ఎన్టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డు–2023 దక్కింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయనకు ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నగరంలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అవార్డు అందజేశారు.

మన్ కీ బాత్ అవార్డు అందజేత




చార్మినార్: ఆలిండియా షియా మహాసభ జాతీయ అధ్యక్షులు, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు హైదర్ అబ్బాస్ చాంద్‌కు మన్ కీ బాత్ అవార్డును బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అందజేసి ఘనంగా సన్మానించారు. ఆదివారం రాత్రి పాతబస్తీ దారుషిఫాలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేసినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

మృత్యు నాలాలు

ప్రమాదాలకు కారణమవుతున్న నాలాల ఫెన్సింగ్‌లు

- నాలాపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలతో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



మోతీ దర్వాజా వద్ద ప్రమాదకరంగా నాలా ఫెన్సింగ్

గోల్కొండ: నాలాల ఫెన్సింగ్‌కు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఓ వైపు బల్దియా కమిషనర్ నాలాలను ఆధునికీకరిస్తున్నామని ప్రకటనలు ఇస్తుండగా, మరోవైపు నగర మేయర్ నిత్యం నగరంలోని నాలాలను పరిశీలిస్తున్నారు. అయితే నాలాల నిర్వహణలో అధికారుల వైఖరిలో ఎలాంటి మార్పు రావడం లేదు. మూగజీవాలతో పాటు మనుషుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నాలాల వద్ద పలుచోట్ల ఫెన్సింగ్ లేక ప్రమాదాలు జరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో నాలాలకు ఏర్పాటు చేసిన ఇనుప జాలి కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాలా మీదుగా వెళ్లే విద్యుత్ తీగలు వదులుగా మారి గాలికి ఊగుతూ నాలాకు ఉన్న ఇనుప ఫెన్సింగ్‌కు తగులుతుండటంతో తరచూ షార్ట్ సర్క్యూట్‌లు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితం గోల్కొండ డివిజన్ అహ్మద్ కాలనీలో నాలా సమీపంలోని ఓ ఇంటి యజమాని ప్రమాదవశాత్తు నాలా ఇనుప ఫెన్సింగ్‌ను ముట్టుకున్నాడు. అయితే వదులుగా ఉన్న విద్యుత్ తీగలు ఫెన్సింగ్‌కు అతుక్కుపోయి ఉండటంతో ఖాలెద్ అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నానల్‌నగర్ డివిజన్‌లో ప్రవహించే బుల్కాపూర్‌నాలా సైతం ఫెన్సింగ్ లేక ప్రమాదకరంగా మారింది. ఫెన్సింగ్ ధ్వంసం కావడంతో మూగజీవాలు నాలాలో పడి మృతి చెందుతున్నాయి. నాలాల్లో పూడికలు, పిచ్చి మొక్కలు పెరగడంతో అందులోపడ్డ మేకలు, గేదెలు బయటకి రాలేక పోయి మృత్యువాత పడుతున్నాయి. ఫెన్సింగ్ లేని నాలాలు పలుచోట్ల పొంగి పొర్లుతున్నాయి. నాలా నుంచి వచ్చే దుర్గంధంతో నాలా పరిసర ప్రాంతాల వాసులు రోగాల బారినపడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నాలాలకు ఉన్న ఇనుప ఫెన్సింగ్‌ను తొలగించి రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



నాలా ఫెన్సింగ్‌ను తాకుతున్న విద్యుత్ తీగలు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అబిడ్స్: ప్రజల అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, అందుకే అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మహేశ్వరీ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహేశ్వరీ మహోత్సవ్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాల ప్రజలు నగరంలో స్థిరపడ్డారని, వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటూ అన్ని విధాల సహకరిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని దుర్మార్గపు రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. మతాల మధ్య చిచ్చుపెట్టి విబేధాలు సృష్టించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మహేశ్వరీ సమాజ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హరినారాయణ రాఠీ, రజని రాఠీ, రాధేశ్యామ్, రంగు శారద, మహేష్ బల్‌దేవా పాల్గొన్నారు.



మంత్రి తలసానిని సత్కరిస్తున్న మహేశ్వరీ సమాజ్ నాయకులు

ట్రాఫిక్ నిబంధనలతోనే ప్రమాదాల నియంత్రణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు

అబిడ్స్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని టీటీఐ (ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్) ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. కొందరు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆర్‌కెఎస్ మోటర్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందికి రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.... కొందరు వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, స్టాప్‌లైన్ దాటడం, ట్రిపుల్ రైడింగ్ తదితర ఉల్లంఘనలకు పాల్పడుతున్నందున ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రహదారులపై వాహనదారులు క్రమ శిక్షణతో వ్యవహరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండినవారే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అవసరమన్నారు. ఎస్ఐ.జ్యోతి, చక్రధర్, చిరంజీవి, నరేందర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించండి



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, నాయకులు సహకారం అందించాలని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు జె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ, అనుబంధ విభాగాల నాయకులు ఇటీవల కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణం, ప్రారంభోత్సవానికి కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా అడ్వైజరీ సెల్ కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు మాణిక్ ప్రభు, బీసీ సెల్ అధ్యక్షులు జగదీశ్ యాదవ్, బీజేవైఎం అధ్యక్షుడు రాజ్‌పాల్, డివిజన్ కార్యదర్శి రామ్‌కుమార్, యువమోర్చా కార్యదర్శి డి.నరేష్, సంతోష్, శివాజీ, ధినేష్, సాయి కిరణ్, ఎస్ఐలు శేఖర్, మన్మోహన్ పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్‌కు సత్కారం



చార్మినార్: హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని పాతబస్తీ పురానాపూల్‌కు చెందిన సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకులు శివ కుమార్ జీతప్ప సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ పార్టీ చేస్తున్న కృషికి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎంపీకి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా పరిశీలన



ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న వెంకటేశ్

గౌలిపురా: ఓటర్ల జాబితా పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నగరంలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం చార్మినార్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ సర్కిల్–9 పరిధిలోని లాల్‌దర్వాజా, పంచముఖి హనుమాన్ దేవాలయం, లాల్ పాషా మసీదు, జగదీష్ మందిర్, దూద్‌ఖానా బస్తీల్లో ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నియోజకవర్గంలో బస్తీలు, కాలనీల్లో ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితాలో పేర్లు ఉన్న వారు ఆ నివాసంలో ఉంటున్నారా...? లేదా..? ఆరుగురు ఓటర్ల కంటే అధికంగా ఉన్న చిరునామాల వారు నిజంగానే నివసిస్తున్నారా.. తదితర వివరాలను బీఎల్ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.ఇంట్లో అన్ని ఓట్లు సక్రమంగా ఉన్నాయా...? లేదా...?... నూతనంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే నూతన ఓటర్ నమోదు చేసుకునేందుకు వారికి ఫారాలను అందజేయాలన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గోషామహాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. సోమవారం ఆయన ఎల్బీ స్టేడియంలో బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గోషామహాల్ నియోజకవర్గం పరిధిలోని క్రీడాకారులకు అండగా ఉంటూ వారి అభివృద్ధి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారం



అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యులు, రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆస్పత్రిలోని వంటశాలలను తనిఖీ చేశారు. పరిసరాలు, ఆహారం వండే విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కిచెన్, దోబీఘాట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

అఫ్జల్‌గంజ్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం గౌలిగూడలోని మహబూబ్ గంజ్ పాత మోటార్ పార్ట్స్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మంచి నీటి కొరత తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో పార్టీ నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మేంద్ర తివారీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఈఓ శ్రీనివాసరాజు

గోల్కొండ: దాతల సహకారంతోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమని నానల్‌నగర్ తిరుపల్లగడ్డలోని శ్రీకోవెల రంగనాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీ నృసింహ సమేత గోదా రంగనాథ స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ పాలెం మనోహర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. లంగర్ హౌస్ పీఠాధిపతి రాహుల్ దాస్ బాబా, దేవీ ఉపాసకులు రాజు వస్తాద్, నరసింహ పాల్గొన్నారు.

నిజమైన దేశభక్తుడు సావర్కర్



వీర్ సావర్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: వీర్ సావర్కర్ నిజమైన దేశ భక్తుడని నేషనలిస్ట్ హబ్ ఫౌండర్ సీఈఓ సాయికృష్ణ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లోని ఉప్పరబస్తీలో స్వతంత్ర వీర్ సావర్కర్ అసోసియేషన్ కార్వాన్ భాగ్యనగర్ ఆధ్వర్యంలో వినాయక్ దామోదర్ సావర్కర్ 140 జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో తన జీవితాన్ని ధారపోసిన మహా వ్యక్తి అని కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జొన్నకుంటి మధుసూదన్ పాల్గొన్నారు.



ఆసక్తి ఉంటేనే చిత్రకళలో రాణిస్తారు



జి.వెంకటేశ్వర్లను సత్కరిస్తున్న యూనివర్సిటీ సిబ్బంది

విజయనగర్‌కాలనీ: ప్రత్యేక అభిరుచిగలవారు మాత్రమే చిత్రకళలో రాణిస్తారని ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాల పెయింటింగ్ విభాగం సమన్వయ కర్త (అడ్‌హాక్) అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.వెంకటేశ్వర్లు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జేఎన్ఏఎఫ్ఏయూ పెయింటింగ్ బ్రాంచ్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.వెంకటేశ్వర్లును సోమవారం వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిత్రకళ ఇతర కోర్సులకు భిన్నమైనదన్నారు. కళలపట్ల గౌరవ భావం, నేర్చుకోవాలనే తపన, ఏదైనా ప్రత్యేకంగా సాధించాలనుకునే విద్యార్థులు ఈ రంగంలో రాణిస్తారన్నారు. పెయింటింగ్ కళ ఉన్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంతారెడ్డి, గుర్రం మల్లేష్, ఆనంద్ గడప, వంశీకృష్ణ, వీఎస్.చారి పాల్గొన్నారు.

పైనీరు ముత్యాలమ్మ దేవాలయ నూతన కమిటీ ఎన్నిక



ఆనంద్ గుప్తాను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు, నాయకులు

దూద్‌బౌలి: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని దూద్‌బౌలి పైనీరు ముత్యాలమ్మ దేవాలయం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం భవనంలో జరిగిన సమావేశంలో దేవాలయ కమిటీ చైర్మన్‌గా దోరేటి ఆనంద్ గుప్తా, అధ్యక్షులుగా వెంకటాచలం ముదిరాజ్, కోశాధికారిగా సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా కట్టా నర్సింహారావు ముదిరాజ్, ముఖ్య సలహాదారులుగా వర్కల యాదగిరి, కట్టా బాల కిషన్ ముదిరాజ్, కల్వగిరి శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస చారి, కార్య నిర్వాహక కార్యదర్శిగా ప్రమోద్ కుమార్ ముదిరాజ్, కార్యదర్శిగా నిరంజన్ కుమార్, మనీష్ గౌడ్, కో–ఆర్డినేటర్‌గా అజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు నౌతన్ కుమార్, రాఘవేందర్ ముదిరాజ్, ఎస్.శ్రావణ్ కుమార్, సతీష్, కిరణ్ చారి, రాకేశ్ యాదవ్, విఠల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఆనంద్ గుప్తా మాట్లాడుతూ... ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీలో సభ్యత్వం పొందినప్పటి నుంచి దూద్‌బౌలి పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే బోనాల జాతర ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నిరంజన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఆనంద్ గుప్తాను సన్మానించారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

జియాగూడ: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి రూ.58 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని నీలకంఠ నగర్, కేజీఎన్ హోటల్ ప్రాంతంలో జియాగూడకు చెందిన ప్రశాంత్, సాయి, అశోక్, హజర్‌లు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం

సంతోష్‌నగర్: కుమారుడిని తీసుకుని బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై హిమారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కంచన్‌బాగ్ పరిధిలో హఫీజ్‌బాబానగర్ సి–బ్లాక్ ప్రాంతంలో సలామత్ ఉల్లా, షంషీదా (25) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 25న సలామత్ ఉల్లా బయటికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి అతడి భార్య షంషీదా, కుమారుడు నూర్ ఆయిషా (18నెలలు) కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన సలామత్ ఉల్లా వారి కోసం గాలించినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో తన భార్య, కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, బుద్వేల్, చింతల్‌మెట్ బస్తీల్లో గోతులమయంగా మారిన రహదారి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ జగన్, ఈఈ అంజయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2020లో బస్తీలో సీసీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు చేపట్ట లేన్నారు. గోతులమయమైన రోడ్డు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో నాయకులు, బస్తీల పెద్దలు

లంగర్‌హౌస్: నల్ల పోచమ్మ దేవాలయ 10వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. తెలంగాణ బోనాల ప్రారంభం రోజునే పూజలు అందుకునే లంగర్‌హౌస్ నల్లపోచమ్మ ఆలయాన్ని పునః నిర్మించి పదేళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, హోమం, ఆలయ శిఖరాభిషేకము, కూష్మాండ బలి, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని అందంగా ముస్తాబు చేశారు. వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గరిషె నర్సింగ్ రావు, వినోద్‌కుమార్ గౌడ్, ఇంద్రసేనా రెడ్డి, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు పాండు యాదవ్, వివిధ పార్టీల నాయకులు జీవన్‌సింగ్, అమర్‌సింగ్, దేవర శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, దేవర వంశి, పరమేష్, శివ శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం దారుణం



గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ బుడగజంగం బస్తీకి మూడు రోజులుగా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం దారుణమని సీఐటీయూ నాంపల్లి జోన్ కమిటీ కన్వీనర్ టి. మల్లేష్ అన్నారు. పేదలు నివసించే బస్తీలో షార్ట్ సర్క్యూట్‌ను సాకుగా చూపుతూ విద్యుత్ శాఖ అధికారులు బస్తీకి విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఆరోపించారు. ఈ విషయంపై తాను ఉన్నతాధికారులతో మాట్లాడినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో స్వచ్ఛ ఆటో కార్మికులే ఎక్కువగా ఉంటున్నారని, వారిపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న అధికారులు తమ వైఖరిని మార్చుకుని వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు , బుడగజంగం బస్తీవాసులు పాల్గొన్నారు.